



# మన దునియా

Our News Our World

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

మన దునియా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 288 | జూన్ 16 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# ప్రభుత్వాన్ని రద్దు చేసి.. ఎన్నికలకు వెళ్లాలన్న బీజేపీ సవాల్ కు..

# సీఎం రేవంత్ రెడ్డి అంతే ధీటుగా ప్రతి సవాల్ విసిరారు..!



సీఎం రేవంత్ రెడ్డి

VS



ప్రధాని నరేంద్ర మోదీ

## • మాటకు మాట.. సవాల్ కు సవాల్..! ఢిల్లీ నుండి తెలంగాణ వరకు రాజకీయ వేడి..!

**మన దునియా,హైదరాబాద్:జూన్15**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోడీ ముందుగా తన పదవికి రాజీనామా చేసి కేంద్ర ప్రభుత్వాన్ని రద్దు చేస్తే.. తాను కూడా సీఎం పదవికి రాజీనామా చేయడంతో పాటు శాసన సభను రద్దు చేసేందుకు సిద్ధమని ఛాలెంజ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ ఉందని.. అధికారంలో కొనసాగడానికి బీజేపీ మాదిరిగా ఇతర పార్టీల మద్దతుపై ఆధారపడటం లేదని కౌంటర్ ఇచ్చారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సంకీర్ణ భాగస్వాములపై ఆధారపడి ఉందని.. అలాంటి పార్టీకి తనను రాజీనామా చేయమని డిమాండ్ చేసే నైతిక హక్కు లేదన్నారు. స్పష్టమైన ప్రజా తీర్పు లేకపోవడంతో ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న బీజేపీ ముందుగా రాజీనామా చేయాలని.. ఆ తర్వాత నన్ను రాజీనామా

(మిగతా 2వ పేజీలో..)

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను ఒప్పించలేకపోయారు: రేవంత్ పై కేటీఆర్ ఫైర్

### హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు అనుమతులు తేలేకపోవడం రేవంత్ ప్రభుత్వ వైఫల్యమేనన్న కేటీఆర్

### ఓటుకు నోటు కేసు భయంతోనే బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపణ

### మెట్రో వైఫల్యంపై సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మిగతా 2వ పేజీలో..)



## ఓటు చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే వారి 'మెదడు చోరీ అయినట్లు కనిపిస్తోందని బీజేపీ రాష్ట్ర రాంచందర్రావు ఎద్దేవా చేశారు.



**మన దునియా,హైదరాబాద్:జూన్15**

1980 లోనే సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఇందిరా గాంధీ సఫదర్‌జంగ్ రోడ్ నివాసంలో ఓటరుగా నమోదయ్యారని రికార్డులు ఉన్నాయని, కాంగ్రెస్ చరిత్రే ఓట్ల చోరీ, సీట్ల చోరీలతో కూడుకున్నదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ అంతర్గత ఎన్నికల్లో

(మిగతా 2వ పేజీలో..)

## 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

### వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరం

### విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలి

**మన దునియా,హైదరాబాద్:జూన్15**

వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన

(మిగతా 2వ పేజీలో..)




## దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు.. కిషన్‌రెడ్డిపై మోదీ ప్రశంసలు



కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ ప్రగతి కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. బొగ్గు, గనుల రంగాల బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోదీ.. కిషన్‌రెడ్డి కష్టపడి పనిచేసే నాయకుడని పేర్కొన్నారు. సంస్కరణలు, విధానపరమైన చర్యల ద్వారా బొగ్గు, గనుల రంగాల్లో మార్పు తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని కొనియాడారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు

(మిగతా 2వ పేజీలో..)

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తూ రాబోయే 3 నుంచి 4 రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరించే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం మంత్రి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అప్రమత్తం చేస్తూ అధికారులతో సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు.నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించగా, ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతోందన్నారు. జూన్ 14 నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాలు, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకాయని తెలిపారు.రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు ఉందని పేర్కొన్నారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బందితో నిరంతరం సమన్వయం కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అన్ని జిల్లాల అధికారులు నిరంతర అప్రమత్తతతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### ఓటు చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే వారి 'మెదడు చోరీ అయినట్లు కనిపిస్తోందని బీజేపీ రాష్ట్ర రాంచందర్రావు ఎద్దేవా చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

సర్దార్ పటేల్‌కు 28 ఓట్లు, నెహ్రూకు కేవలం 2 ఓట్లు వస్తే నెహ్రూను పీఎంను చేయడం ఓటు చోరీ కాదా..?? అని ప్రశ్నించారు. 1975లో అలహాబాద్ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని చోరీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది కాదా..?? అని నిలదీశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొందరు రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ కు చెందినవారికి రిటైర్మెంట్ తర్వాత పద్మ అవార్డులు, రాజ్యసభ సీట్లు ఇచ్చి రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసిందని ఆరోపించారు. బోగస్ ఓట్లతో గెలిచే అలవాటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఇప్పుడు ఎస్ఐఆర్ వల్ల తమ దొంగ ఓట్లు ఎగిరిపోతాయనే భయంతో ఏడుస్తున్నాయన్నారు. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో బీజేపీ గెలిచిందని మేధావులమని చెప్పుకునే కొందరు కాంగ్రెస్ నేతలు విమర్శించడం హాస్యాస్పదమన్నారు. అదే ఎస్ఐఆర్ జరిగిన కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెలిచినప్పుడు ఎస్ఐఆర్ గుర్తుకురాలేదా అని నిలదీశారు. దేశ సరిహద్దులైన బిహార్, పశ్చిమ బెంగాల్‌తో పాటు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో కూడా రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీ అక్రమ చొరబాటుదారులు స్థానికంగా రాజకీయ పార్టీల మద్దతుతో దొంగ ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు సంపాదించి ఓటర్లుగా నమోదవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓల్డ్ సిటీలో ఒక్కో ఇంట్లో 200 దొంగ ఓట్లు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో దాదాపు 5 వేల నుండి 10 వేల మంది పాకిస్తానీయులు చట్టవిరుద్ధంగా ఓవర్ స్టేయింగ్ చేస్తున్నారని, వారికి ఓటు హక్కు కల్పించాలా అని కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలను ప్రశ్నిస్తూ నిలదీశారు. భారత రాజ్యాంగం ప్రకారం కేవలం భారత పౌరుడికి మాత్రమే ఓటు హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. దొంగ ఓట్లను ఏరివేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని, అర్హులైన ఏ ఒక్క పౌరుడి ఓటూ పోదని హామీ ఇచ్చారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాజకీయ స్వార్థంతో బురదజల్లుతున్నాయని మండిపడ్డారు. ఎస్ఐఆర్ అనేది రాజ్యాంగబద్ధంగా ఎన్నికల సంఘం నిర్వహించే నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.దేశంలో ఇప్పటివరకు 12 సార్లు ఈ ప్రక్రియ విజయవంతంగా జరిగిందని గుర్తుచేశారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, చిరునామాలు మారిన వారి వివరాల సవరణ కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తారన్నారు. 1951 నుండి 2002 వరకు కాంగ్రెస్ హయాంలోనే అనేకసార్లు ఎస్ఐఆర్ జరిగితే అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నాడు తాము ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించామని, కానీ నేడు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే స్వరంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కుట్రపూరిత ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.



## ప్రభుత్వాన్ని రద్దు చేసి.. ఎన్నికలకు వెళ్లాలన్న బీజేపీ సవాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి అంతే ధీటుగా ప్రతి సవాల్ విసిరారు..

(మొదటి పేజీ తరువాయి)

చేయమని కోరాలని సూచించారు. రాజకీయ సవాళ్లు ఏకపక్షంగా ఉండకూడదని.. అన్ని పార్టీలకు సమానంగా వర్తించాలని పేర్కొన్నారు.

కిషన్ రెడ్డి వల్లే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు ఆటంకం..!!

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2ను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వల్లే ఐఆర్ఎఫ్?సీ లోన్ బదిలీ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. ఐఆర్ఎఫ్ సీ రుణం బదిలీ ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. డాక్యుమెంట్ల ఫీజు కింద అక్షరాలా 84 కోట్ల రూపాయలు కూడా చెల్లించాం. ఈక్విటీ కింద మరో రూ.1400 కోట్లు కూడా జమ చేశామన్నారు. 13 వేల 400 కోట్ల రూపాయల భారీ రుణాన్ని.. కేవలం 4 శాతం వడ్డీకే, 20 ఏళ్ల కాల పరిమితితో తెచ్చేందుకు అన్ని ఒప్పందాలూ పూర్తయ్యాయని చెప్పారు. కానీ.. సరిగ్గా ఇదే సమయంలో సీన్?లోకి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎంటరై అడ్డుకున్నారని చెప్పారు. మే 21వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ను ప్రత్యేకంగా కలిసిన కిషన్ రెడ్డి... ఈ రుణ ప్రక్రియను పూర్తిగా అడ్డుకున్నారని రేవంత్ తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ఉండాలా? వద్దా? అంటూ కేంద్ర పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. నిజానికి ఈ రోజుకల్లా లోన్ బదిలీ పూర్తి కావాల్సి ఉంది. కానీ, కేవలం కిషన్ రెడ్డి రాజకీయం వల్లే ఈ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు రేవంత్. అసలు ఐఆర్ఎఫ్ సీ లోన్ ఎందుకు ఇవ్వట్లేదో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు లోన్ శాంక్షన్ కాకుండా మీరే అడ్డుకుంటున్నారా..? లేదా..? అన్న దానిపై స్పష్టత ఇవ్వాలి. దీనిపై కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడుతారా? లేదా? అని రేవంత్ రెడ్డి నిలదీశారు . ఒకవేళ కేంద్రం లోన్ ఇవ్వకపోతే... కనీసం వేరే చోట తెచ్చుకోవడానికి ఎన్ ఓసీ అయినా ఇప్పిస్తారా లేదా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ తిట్టినట్లుగా తామెప్పుడూ కిషన్ రెడ్డిని తిట్టలేదని.. కేంద్రమంత్రిగా ఆయనపై గౌరవం ఉంది కాబట్టే సమన్వయం కోరుకుంటున్నామని స్పష్టం చేశారు.

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను ఒప్పించలేకపోయారు: రేవంత్ పై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఘోరంగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.యూపీ, అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులు మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తేలేకపోయారో రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా తన 'పెద్దన్న'ను (మోదీ) ఒప్పించలేకపోవడం ఆయన చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తోందన్న భయంతోనే రేవంత్ రెడ్డి బీజేపీతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే మెట్రో విస్తరణను నిరాకరిస్తున్న ప్రధానిని, కేంద్రాన్ని విమర్శించే ధైర్యం, దమ్ము ఆయనకు లేవని అన్నారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తే, ఈ అసమర్థ పాలనలో అన్నీ నిలిచిపోయాయని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో తనను 'చెప్పుల దొంగ'లా చూస్తున్నారని రేవంత్ రెడ్డే స్వయంగా చెప్పడం ఆయన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ అన్నారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును సాధించడంలో విఫలమైనందుకు సీఎం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 'మినీ ఇండియా' లాంటి హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం కావడం ఖాయమని హెచ్చరించారు.

### దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు.. కిషన్‌రెడ్డిపై మోదీ ప్రశంసలు

.కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలన్న మోదీ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం కిషన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. బొగ్గు, గనుల రంగాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ పురోగతికి దోహదపడుతోందని పేర్కొన్నారు.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు కూడా కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.






# విద్యార్థులకు ఘన స్వాగతం.. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ







**ఖానాపూర్ ఆర్సి మన దునియా, జూన్; 15.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం అక్కపల్లి గూడ ప్రభుత్వ పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కు సుష్మా, భూమేష్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మంగళహారతితో స్వాగతం పలికారు.అనంతరం ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను విద్యార్థులకు పంపిణీ చేసి నూతన విద్యా సంవత్సరానికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమేష్ , వార్డు సభ్యులు పిల్లి మల్లయ్య , ముద్రకోలా హారిక రవి , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమాదేవి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్ , ఉపాధ్యాయులు శెట్టి రాజశేఖర్, అంకం కరుణ, సుదీప తేజ, శ్రీలత, మౌనిక తదితరులు పాల్గొని అతిథులను సన్మానించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులకు, తల్లిదండ్రులకు మరియు విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.నూతన విద్యా సంవత్సరం తొలి రోజున విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది.

# ప్రజల ఆరోగ్య రక్షణే మా ప్రధాన లక్ష్యం..





**వంజరపల్లి సర్పంచ్ మోర్తాల చందర్ రావు**

**సర్పంచ్ ప్రత్యేక చొరవతో 'కోగిలవాయి మిషన్ భగీరథ ప్లాంట్' సందర్శన**

**సుమారు 60 మంది గ్రామస్తులతో కలిసి నీటి నాణ్యతను పరిశీలించిన సర్పంచ్**

**సంగెం,జూన్15 మన దునియా**


గ్రామ ప్రజల ఆరోగ్యం సురక్షితంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో, వంజరపల్లి గ్రామసర్పంచ్ మోర్తాల చందర్ రావు ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామస్తులతో కలిసి ఆదివారం హనుమకొండ జిల్లా పరిధిలోని కోగిలవాయి నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని (మిషన్ భగీరథ ప్లాంట్) సందర్శించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందుతున్న తాగునీటి నాణ్యతపై గ్రామస్తుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి, సర్పంచ్ స్వయంగా ప్రజాప్రతినిధులు, వాటర్ కమిటీ సభ్యులు మరియు సుమారు 60 మంది గ్రామస్తులను ప్లాంట్ కు తీసుకువెళ్లారు.సర్పంచ్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన: ప్లాంట్లో జరుగుతున్న నీటి శుద్ధీకరణ ప్రక్రియ, బ్యాక్టీరియావిశ్లేషణలు, రసాయన ప్రమాణాల నియంత్రణ విధానాలను సర్పంచ్ మోర్తాల చంద్రరావు దగ్గరుండి పరిశీలించారు. ప్లాంట్ ఇంజనీర్ ప్రశాంత్, ల్యాబ్ టెక్నీషియన్లు క్రాంతి, మహేష్ ను నీటి నాణ్యత ప్రమాణాల గురించి సర్పంచ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి చుక్క నీరు పూర్తి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగానే సరఫరా అవుతుందని అధికారులు సర్పంచు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వంజరపల్లి సర్పంచ్ మోర్తాల చంద్రరావు మాట్లాడుతూ... గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే మా మొదటి ప్రాధాన్యత అని, గతంలో ఉన్న నీటి ప్లాంట్ల కంటే ప్రస్తుతం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శు ద్ధీకరణ కేంద్రంలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తున్నారని అన్నారు. ప్లాంట్ను నేరుగా పరిశీలించిన తర్వాత నీటి నాణ్యతపై మాకు పూర్తి నమ్మకం కలిగిందని గ్రామ ప్రజలందరూ ఎలాంటి అపోహలు లేకుండా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న శుద్ధ నీటినే వినియోగించి ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. వాటర్ కమిటీ అధ్యక్షుడు కౌడగాని శంకరరావు మాట్లాడుతూ.. సర్పంచ్ చంద్రరావు నేతృత్వంలో జరిగిన ఈ పర్యటన వల్ల గ్రామస్తులందరికీ తాగునీటి నాణ్యతపై పూర్తి అవగాహన వచ్చిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన నీటిని వినియోగించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. సర్పంచ్ మోర్తాల చంద్రరావు సారథ్యంలో జరిగిన ఈసందర్శనలో వాటర్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెరువులను కాపాడాలి,ఎంఆర్ఓకు వంగపల్లి గ్రామ పాలకవర్గం వినతి

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలోని ఊర చెరువు, వివిధ కుంటలు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని గ్రామ పాలకవర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం కమలాపూర్ తహసీల్దార్ (ఎంఆర్ఓ)కు వినతిపత్రం సమర్పించారు. చెరువులు, కుంటల భూములను కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ, అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి అసలు హద్దులను గుర్తించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. అలాగే చెరువులు, కుంటల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువులు, కుంటల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ పాలకవర్గం డిమాండ్ చేసింది.






## హనుమకొండ పద్మాక్ష రోడ్డులో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం

**మన దునియా: హనుమకొండ**



నందు శ్రీ రామదూత పరపతి సంఘం 25వ సంవత్సర సిల్వర్ జూబ్లీ వేడుకల సమావేశము నిర్వహించడమైనది ఈ యొక్క సంఘం ద్వారా దేవాలయలో నిత్య దూప దీప నైవేద్య నిర్వహణ జరుగుచున్నది అలాగే గౌరవ సభ్యుడు మరణిస్తే 30 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరుగుతున్నది ఈ యొక్క సమావేశంలో గౌరవ సభ్యులు వారి వారి అభిప్రాయాలను వ్యక్తపరచనైనది. ఆదాయపట్టిక ఆమోదించనైనది ఈ వేడుకల్లో ప్రతి సభ్యుణ్ణి సన్మానించి 25వేల రూపాయలు అందించనైనది ఈ సమావేశంలో ముందుగా పద్మాక్షి ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ నాగిళ్ల పద్మనాభ శర్మ అవధాని గారిని సన్మానించనైనది అలాగే మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తోట ప్రకాష్ కాకతీయ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తోట కనకరాములు మున్నూరు కాపు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రవికుమార్ ఏడవ డివిజన్ మాజీ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ గార్లను సన్మానించడమైనది ఈ కార్యక్రమము అధ్యక్షులు అంబటి నరేందర్ కార్యదర్శి గందె కృష్ణ కోశాధికారి దేవులపల్లి సంపత్ ఆడిటర్ మనోజ్ కుమార్ డైరెక్టర్స్ గందె మధు గుండు శంకర్ హర్షం కృష్ణమూర్తి ఆలయ అధ్యక్షులు బెండల అర్జున్ రావుకర్రు దశ కుమార్100 మంది సభ్యులు పాల్గొన్నారు

## ధర్మారం పాఠశాలలో నూతన విద్యా సంవత్సర వేడుకలు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా ,జూన్;15.**




మంచిర్యాల్ జిల్లా జన్నారం మండలం ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సర ప్రారంభ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను గ్రామ సర్పంచ్ ఆత్రం గోదావరి, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబడి సతన్న మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం కూడా అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దుర్గం మహేందర్, గల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, వార్డు సభ్యులు రాచకొండ రాజేష్, పంచాయతీ కార్యదర్శి సర్వ జలంధర్, ఉపాధ్యాయులు కుడాల శ్రీనివాసరావు, సాత్పడి నర్సయ్య, సాదుల నర్సయ్య, మేతరి నాగన్న, జాదవ్ కృష్ణవేణి, ఏలేశ్వరం రచన, పిటిబ్ల్యూ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టసుఖాల్లో అండగా భుఖ్య జాన్సన్ నాయక్



**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం; జూన్ 15:**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన శ్రీను ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా శ్రీను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జాన్సన్ నాయక్, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంపై ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచిస్తూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. ఆయన పరామర్శతో శ్రీను కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## వంట కార్మికుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రధానోపాధ్యాయులకు పంచాయితీ సర్పంచులకు పంచాయితీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమాలు ప్రారంభించడం జరిగినది

**ములుగు జిల్లా జూన్ 15 మన దునియా**



తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులు భాగంగా ఈరోజు నుండి ఈనెల 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రధానోపాధ్యాయులకు సర్పంచ్ లకు పంచాయతీ కార్యదర్శులకు ములుగు జిల్లాలోని మదనపల్లి పత్తిపెల్లి గ్రామాలలో స్వయంగా పాల్గొనివినతి పత్రాలు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 54 వేల రెండు వందల మంది వంట కార్మికులు ఈరోజు అనేకమైన ఇబ్బందులకు గురవుతున్న సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా వినతి పత్రాలు అందజేసి మన బాధలు తెలియజేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన పథకం ఈనెల 20వ తారీకు వరకు కొనసాగుతుంది అన్నారు పంచాయతీ కార్యదర్శులు ప్రధానోపాధ్యాయులు సర్పంచులు స్పందించి వారి వల్ల అయ్యే కార్యక్రమాలను పరిశీలించాలని అలాగే జిల్లా అధికారులకు ఈ వినతి పత్రాలు పంపించాలని కోరడం జరిగినది ప్రధానంగా సమస్యలు కాడికి వస్తే 20 సంవత్సరాలుగా ఈ పథకంలో కొనసాగుతూ జీవిస్తున్న వంట కార్మికులను అకారణంగా చిన్నచిన్న రాజకీయ కారణాలతో డ్వాక్రా గ్రూపుల పేరుతోని కొంతమంది ప్రధానోపాధ్యాయులు కూడా వారి అనుయాలను పెట్టుకోవడం కోసం 20 సంవత్సరాల కొనసాగుతున్న వారిని తొలగించడానికి కూడా వెనుకాడడం లేదు అన్నారు ఎవరిని తొలగించకుండా ఉండాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది అన్నారు అలాగే మెనూ చార్జీలు అతి తక్కువగా ఇచ్చి మెనూ ప్రకారం వంటలు చేయాలని ఒత్తిడి చేస్తే ఎలా సాధ్యం అవుతుంది అది కూడా ఆలోచించాలని అన్నారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రూపాయలు 10000 వేతనాలు వెంటనే చెల్లించాలని సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది అన్నారు కనుక పై అధికారులు ఈ విషయాలను గమనించి వంట కార్మికులకు న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మురహరి రాము సోమిడి అరుణ పొన్నాల లలిత సారా సారమ్మ తదితరులు పాల్గొన్నారు

## అనుమానాస్పద పరిస్థితుల్లో మైనర్ బాలిక ఆత్మహత్య..!

**పోలీసుల అదుపులో నిందితుడు?**


**మన దునియా,వరంగల్:జూన్ 15**



వరంగల్ నగరంలోని మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.స్థానికులు, బంధువుల కథనం ప్రకారం సదరు యువకుడికి ఇప్పటికే వివాహం జరిగి, ఒక కుమారుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమ పేరుతో మైనర్ బాలికను తన వలలో వేసుకున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు.బాలిక పుట్టినరోజు వేడుకల పేరుతో యువకుడు ఆమెను ఓయో రూమ్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ సందర్భంగా బాలికను మేజర్‌గా చూపించి గది తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో ములుగు రోడ్డు ప్రాంతంలోని ఓయో రూములు, లాడ్జీల నిర్వహణపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సరైన గుర్తింపు పత్రాలు, వయస్సు ధృవీకరణ లేకుండానే గదులు కేటాయిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మైనర్లను మేజర్లుగా చూపించి గదులు కేటాయించినట్లయితే సంబంధిత నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హోటళ్లు, లాడ్జీలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు యువకుడిని విచారిస్తున్నారు. బాలిక మృతికి గల అసలు కారణాలు, ఘటనలో ఇతరుల పాత్ర, అలాగే సంబంధిత హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.గమనిక:- బంధువులు చేసిన ఆరోపణలు, స్థానికుల అనుమానాలపై పోలీసులు ఇంకా అధికారికంగా ధృవీకరణ ఇవ్వాల్సి ఉంది. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## వాహన్-సారథి సాఫ్ట్‌వేర్ నిలిచిపోవడంతో రవాణా సేవలకు అంతరాయం

**మన దునియా,హైదరాబాద్:జూన్15**




హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా వాహన్ సారథి సాఫ్ట్‌వేర్ సేవలు అకస్మాత్తుగా నిలిచిపోవడంతో రవాణా శాఖ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో రాష్ట్రంలోని ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, యాజమాన్య మార్పిడి తదితర సేవలు నిలిచిపోయాయి. సేవల కోసం వచ్చిన ప్రజలు రవాణా శాఖ కార్యాలయాల్లో భారీగా క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.సాంకేతిక సమస్య కారణంగానే వ్యవస్థ నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణులు చర్యలు చేపట్టారని, సేవలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించడానికి సుమారు గంట సమయం పట్టే అవకాశం ఉందని వెల్లడించారు.సాఫ్ట్‌వేర్ పునరుద్ధరణ అనంతరం సేవలు యథావిధిగా అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అవసరమైతే కొంత సమయం తర్వాత కార్యాలయాలను సందర్శించాలని సూచించారు.

# గిరిజన దర్బార్‌లో గిరిజనేతరుల దరఖాస్తులు ఎందుకు?

# -- ఐటిడిఏ అధికారులు వెంటనే సమాధానం చెప్పాలి!

**గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఏను గిరిజనేతరుల సమస్యల కేంద్రంగా మార్చొద్దు!**

**షెడ్యూల్డ్ ఏరియా చట్టాల ఉల్లంఘనను తుడుం దెబ్బ సహించదు -- అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి**

**తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తాటి నీలాద్రి డిమాండ్**

**ఏటూరునాగారం జూన్ 15 మన దునియా**

ములుగు జిల్లాలో ని గిరిజనుల సంక్షేమం హక్కుల పరిరక్షణ మరియు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐటిడిఏలో నిర్వహిస్తున్న గిరిజన దర్బార్‌లో గిరిజనేతరుల దరఖాస్తులను స్వీకరించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఏటూరునాగారం మండల అధ్యక్షులు తాటి నీలాద్రి తీవ్రంగా ఆక్షేపించారు గిరిజనుల సమస్యలను వినడానికి వారి భూములు ఉపాధి విద్య ఆరోగ్యం మరియు సంక్షేమ అంశాలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఐటిడిఏ వ్యవస్థను ఏర్పాటు చేసిందని అలాంటి గిరిజన దర్బార్‌లో గిరిజనేతరుల దరఖాస్తులను స్వీకరించడం ఐటిడిఏ ఉద్దేశ్యానికే విరుద్ధమని ఆయన పేర్కొన్నారు షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనులకు రాజ్యాంగం ప్రత్యేక రక్షణలు కల్పించిందని ఐదవ షెడ్యూల్ పీసా చట్టం మరియు గిరిజన రక్షణ నిబంధనల స్ఫూర్తికి విరుద్ధంగా గిరిజనేతరుల దరఖాస్తులను స్వీకరించడం వల్ల గిరిజనుల హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు గిరిజనుల సమస్యలు పరిష్కారం కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్న సమయంలో గిరిజనేతరుల దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అసలు లబ్ధిదారులైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు గిరిజనుల కోసం ఏర్పడిన వ్యవస్థలను క్రమంగా గిరిజనేతరులకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు ఐటిడిఏ అధికారులు వెంటనే స్పందించి గిరిజన దర్బార్‌లో స్వీకరించిన గిరిజనేతరుల దరఖాస్తుల వివరాలను బహిర్గతం చేయాలని ఏ నిబంధనల ప్రకారం వాటిని స్వీకరించారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు ఇకపై గిరిజన దర్బార్‌లో కేవలం షెడ్యూల్డ్ తెగలకు చెందిన గిరిజనుల దరఖాస్తులను మాత్రమే స్వీకరించాలని కోరారు లేకపోతే ఆదివాసీ హక్కుల



పరిరక్షణ కోసం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఐటిడిఏ కార్యాలయాల ముట్టడి ధర్నాలు నిరసనలు మరియు ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు గిరిజనుల హక్కులు భూములు మరియు రాజ్యాంగ పరిరక్షణలను కాపాడటంలో తుడుం దెబ్బ ఎప్పటికీ రాజీ పడదని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో తుడుం మండల ప్రధాన కార్యదర్శి ఈసం పణికుమార్ ఉపాధ్యక్షులు కోరం సుధాకర్ తాటి నాగేష్ పలక నర్సింగరావు బొగ్గం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబాలకు భరోసా -- క్షేమ సమాచారం తెలుసుకున్న భూక్యా జాన్సన్ నాయక్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జూన్; 15.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల జరిగిన విషాద ఘటనలు, అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా చింతగూడ గ్రామానికి చెందిన గజ్జెల భూపతి ప్రమాదవశాత్తూ మరణించిన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భూపతి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మురిమడుగు గ్రామానికి చెందిన జాడీ బాలరాజు ఇటీవల మరణించగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.అదేవిధంగా, చింతగూడ గ్రామానికి చెందిన ములుమూరి లక్ష్మీ అనారోగ్య కారణాలతో మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.ఇక ప్రమాదవశాత్తూ గాయపడి కాలు ఫ్రాక్చర్ కావడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కొండూకూరి పవన్ కళ్యాణ్ ని వారి నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన విద్యా సంవత్సరాని పురస్కరించుకొని పాఠశాల రీ ఓపెనింగ్ లో పాల్గొన్న ఎమ్ ఈ ఓ, తేజ వత్ వెంకటేశ్వర్లు






**మన దునియా, వాజేడు,జూన్ 15**

ములుగు జిల్లా వాజేడు మండలం లోని వివిధ గ్రామాల్లో పాఠశాలలో పునఃప్రారంభించారు అలాగే చంద్రుపట్ల పాఠశాల పెద్ద గంగారం పాఠశాల, రి ఓపెనింగ్ , స్కూలుకు హాజరయ్యారు అదేవిధంగా గుమ్మడిదొడ్డి గ్రామం లోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల స్కూల్ రీఓపెనింగ్ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి తేజవత్ వెంకటేశ్వరరావు పాఠశాల పున ప్రారంభం వేడుకల్లో పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులంతా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉపాధ్యాయుల బోధనను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధాన ఉపాధ్యాయులు, గిరి ప్రసాద్ మరియు ఉపాధ్యాయులు నాగార్జున, రాజు పాల్గొనడం జరిగింది మరియు చంద్రుపట్లలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్ఎం సంతోష్ కుమార్ మరియు తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు అదేవిధంగా, పెదగంగారం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల టీచర్స్ మరియు పిల్లలు హాజరు కావడం జరిగింది ఈ పున ప్రారంభం, భాగంగా పిల్లలు ,క్రమం తప్పకుండా రావాలని,ప్రైవేటు స్కూళ్ల కంటే, గవర్నమెంట్ ,స్కూల్ లలో నాణ్యతమైన ,విద్యను అందిస్తామని దీనికి పూర్తి సహకారం, ప్రభుత్వం అందిస్తుందని, మరియు శ్రద్ధగా చదువుకొని పై చదువులకు వెళ్లాలని మరియు ప్రభుత్వం అన్ని రకాలుగా డెవలపింగ్ కోసం సహకరిస్తుందని తెలియజేశారు



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
RNI Number



# కొలెస్ట్రాల్ ఉన్న వారు నెయ్యి తినవచ్చా..?

నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. శరీరానికి శక్తి రావాలంటే నెయ్యి తినాలని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. చర్మం, జుట్టు సమస్యలను కూడా నయం చేస్తుంది. నెయ్యి పోషకాలకు పవర్ హౌస్‌గా పేర్కొంటారు. శరీరానికి ఎంతో అవసరమైన విటమిన్-ఎ, విటమిన్-ఇ, విటమిన్-బి విటమిన్ కే తోపాటు విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి.. అంతేకాకుండా.. ఒమేగా -3, ఒమేగా-6 వంటి ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, లినోలిక్, బ్యుటిరిక్ యాసిడ్స్ వంటి పోషకాలు ఉన్నాయి. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రస్తుత కాలంలో కొలెస్ట్రాల్‌తోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు నెయ్యిని తినవచ్చా.. లేదా..? తింటే ఏమవుతుంది..? ఒకవేళ తింటే ఎంత తినాలి.. అనే ప్రశ్నలు సాధారణంగా ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్నాయి. ఆయుర్వేదంలో ఔషధ వినియోగం: నెయ్యిలోని పోషకాలు, విశిష్ట లక్షణాల కారణంగా ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తారు. నెయ్యి శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు కూడా నెయ్యి తినవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అయితే.. రోజుకు కేవలం 2 నుంచి 3 స్పూన్లు నెయ్యి మాత్రమే తీసుకోవడం మంచిది.. అంతకు మించి నెయ్యి తీసుకోకూడదని పేర్కొంటున్నారు.కాబట్టి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తపడాలి. చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.. కొలెస్ట్రాల్ ఉన్నవారు ముందుగా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుని.. వారి సూచనల ప్రకారం.. నెయ్యిని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.




## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.



## ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



## ఉద్యోగ ఒత్తిడితో యువతి ఆత్మహత్య

**మన దునియా,వరంగల్:జూన్ 15**

వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో సోమవారం (15.06.2026) విషాద ఘటన చోటుచేసుకుంది. కాశీబుగ్గ తిలక్ రోడ్డుకు చెందిన గంజి కీర్తన (25) అనే యువతి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కీర్తన బెంగళూరులోని ఓ విదేశీ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఉండేది. గత కొంతకాలంగా ఉద్యోగ ఒత్తిడిని తట్టుకోలేక మానసిక ఆందోళనకు గురై చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.సోమవారం ఉదయం సుమారు 9 గంటలకు ఆమె తండ్రి గంజి ఉమాశంకర్ వ్యాపార పనుల నిమిత్తం బయటకు వెళ్లగా, తల్లి కృష్ణవేణి గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లారు. ఈ సమయంలో కీర్తన ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు సమాచారం. అనంతరం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన తల్లి, కిటికీ ద్వారా చూడగా కీర్తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నితో ఉరికి వేలాడుతూ కనిపించింది.వెంటనే బంధువుల సహాయంతో తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి చున్ని కోసి కిందకు దించినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఇంతేజార్ గంజ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కీర్తన మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం..

## వాజేడు మండల ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ కు అటవీశాఖ క్లియరెన్స్ ఇవ్వాలి కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించిన,ప్రజా పోరాటాల సమితి అధ్యక్షుడు ముత్యబోయిన మహేందర్



**మన దునియా ,వాజేడు ,జూన్ 15**

వాజేడు మండల పరిధిలోని ధర్మవరం నుండి చెరుకూరు వరకు గల ఆర్ అండ్ బి ప్రధాన రహదారి విస్తరణకు తక్షణమే అటవీశాఖ అనుమతులు మంజూరు చేయి పనులు ప్రారంభించారు చర్యలు తీసుకో వాలని పోరాట సమితి ఆధ్వర్యంలో పరిసర గ్రామాల సర్పంచులు పాలకవర్గ సభ్యుల తీర్మాన పత్రాలతో కూడిన వినతి పత్రాన్ని ,ప్రజలు ఈరోజు జిల్లా కలెక్టర్ గారిని ఈ పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సుమారు మూడు కిలోమీటర్ల రహదారి పూర్తిగా గుంతల మయంగా మారి అత్యంత ప్రమాదకరమైన విధంగా ఉందని ఆవేదన వ్యక్తం ప్రతిరోజు ఇసుక లారీలు మరియు భారీ వాహనాల రాకపోకల వల్ల నిత్యం చిన్న పెద్ద ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు రహదారి విస్తరణకు నిధులు మంజూరు అయినప్పటికీ అటవీశాఖ అధికారులు దశాబ్దాలుగా పర్యావరణ నిబంధన పేరుతో అనుమతులు నిరాకరి స్తున్న దీనివల్ల స్థానిక గిరిజన గిరిజనేతర గ్రామాలకు, ప్రాణాలు గాల్లో దీపాలు గా మారాయ ని పేర్కొన్నారు ప్రజాప్రతినిధులు అధికారులు నిర్లక్ష్యానికి గ్రామసభలో ఐదు గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు ఈ రహదారి వాజేడు చుట్టుపక్కల ఉన్న సుమారు 8 గ్రామపంచాయతీల ప్రజల సామాజిక ఆర్థిక వైద్య అవసరాలకు ఏకైక రవాణా మార్గమని అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వెళ్లడానికి కూడా వీలు లేకుండా రోడ్డు దుస్థితి ఉందని తెలిపారు స్పందించిన గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకొని అటవీశాఖ ఉన్నత అధికారులతో మాట్లాడి త్వరలోనే రోడ్డు విస్తరణకు అవసరమైన అనుమతులు వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఈ కార్యక్రమంలో అధ్యక్షు లు ముత్యబోయిన మహేందర్ ఉపాధ్యాక్షులు గార రవికుమార్ స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి.అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.

# శ్రీలంక ఆటగాళ్లతో వైభవ్ సూర్యవంశీ వాగ్వాదం, తోపులాట.. వీడియో వైరల్

శ్రీలంక-ఏతో మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు ఓటమి

సూపర్ ఓవర్‌లో తేలిన మ్యాచ్ ఫలితం

మ్యాచ్ అనంతరం లంక ఆటగాళ్లతో వైభవ్ సూర్యవంశీ వాగ్వాదం

పరస్పరం తోసుకున్న శ్రీలంక ఆటగాళ్లు, సూర్యవంశీ

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఘర్షణ వీడియోలు



శ్రీలంక-'ఏ' జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత్-'ఏ' జట్టు సూపర్ ఓవర్‌లో పరాజయం పాలైంది. అయితే, మ్యాచ్ ఫలితం కంటే కూడా ముగింపు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలే ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. భారత యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ శ్రీలంక ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగడంతో పాటు తోపులాట జరగడం తీవ్ర కలకలం సృష్టించింది.సోమవారం జరిగిన ఈ త్రైపాక్షిక సిరీస్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ సారథ్యంలోని భారత్-'ఏ' జట్టు 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. సూర్యాంశ్ షెడ్గే (72), విప్రాజ్ నిగమ్ (51) అర్ధసెంచరీలతో రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక-'ఏ' జట్టు సైతం నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి సరిగ్గా 265 పరుగులే చేయడంతో మ్యాచ్ 'టై'గా ముగిసింది. లంక జట్టులో సదీర సమరవిక్రమ (93) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అయితే, చివరి ఓవర్‌లో అంపైర్ల నిర్ణయాలు వివాదాస్పదంగా మారడం ఆట సూపర్ ఓవర్‌కు దారితీసేలా చేసింది.సూపర్ ఓవర్‌లో శ్రీలంక-'ఏ' 16 పరుగులు సాధించగా, భారత్-'ఏ' 9 పరుగులకే పరిమితమై ఓటమిని చవిచూసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఆటగాళ్లు మైదానాన్ని వీడుతున్న తరుణంలో వైభవ్ సూర్యవంశీకి, శ్రీలంక ఆటగాళ్లకు మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన వైభవ్ ప్రత్యర్థి ఆటగాడిని తోయడంతో గందరగోళం నెలకొంది. వెంటనే సహచర ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుతంగా రాణించి వెలుగులోకి వచ్చిన వైభవ్, మైదానంలో ఇలా దూకుడుగా ప్రవర్తించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదంపై మ్యాచ్ అధికారులు ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ సిరీస్‌లో 1-2తో వెనుకబడిన భారత్-'ఏ' జట్టు, ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే అఫ్ఘనిస్థాన్-'ఏ' జట్టుతో జరగనున్న తదుపరి పోరులో తప్పక విజయం సాధించాల్సి ఉంది.

# సూపర్ ఓవర్‌లో భారత్-ఏ ఓటమి... ఉత్కంఠ పోరులో శ్రీలంక-ఏ థ్రిల్లింగ్ విక్టరీ

త్రైపాక్షిక సిరీస్‌లో భారత్-ఏపై శ్రీలంక-ఏ విజయం

స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ కు చేరిన మ్యాచ్

సూపర్ ఓవర్ లో శ్రీలంకది పైచేయి

పిచ్‌పై పరుగెత్తినందుకు భారత్‌కు 10 పరుగుల పెనాల్టీ

ఫైనల్ చేరాలంటే ఆఫ్ఘనిస్థాన్‌పై తప్పక గెలవాల్సిన పరిస్థితి



శ్రీలంక-ఏతో జరిగిన ఉత్కంఠభరిత వన్డే మ్యాచ్‌లో భారత్-ఏ సూపర్ ఓవర్‌లో ఓటమి పాలైంది. అయితే, ఈ మ్యాచ్ ఫలితం కంటే ఎక్కువగా అంపైర్ల వివాదాస్పద నిర్ణయాలు, ఇరుజట్ల ఆటగాళ్ల మధ్య చోటుచేసుకున్న తీవ్ర వాగ్వాదాలు, ఉద్రిక్తతలు చర్చనీయాంశంగా మారాయి. డంబుల్లా వేదికగా సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో శ్రీలంక-ఏ కూడా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి సరిగ్గా 265 పరుగులు చేయడంతో మ్యాచ్ టైగా ముగిసింది.దీంతో ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించారు. సూపర్ ఓవర్‌లో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక-ఏ 16 పరుగులు చేయగా, భారత జట్టు 9 పరుగులు మాత్రమే చేసి 7 పరుగుల తేడాతో ఓడిపోయింది. శ్రీలంక బౌలర్ కుగతాస్ మతులన్ అద్భుతంగా బౌలింగ్ చేసి తన జట్టుకు విజయాన్ని అందించాడు.అంతకుముందు, భారత జట్టు ఒక దశలో 143 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో సూర్యాన్ష్ షెడ్గే (72), విప్రజ్ నిగమ్ (51) ఎనిమిదో వికెట్‌కు 104 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అయితే, నిగమ్ రెండుసార్లు పిచ్‌పై పరుగెత్తినందుకు అంపైర్లు భారత్‌కు 10 పరుగుల పెనాల్టీ విధించడం జట్టుకు నష్టం చేకూర్చింది. శ్రీలంక ఛేదనలో సదీర సమరవిక్రమ (93) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా రెండో ఓటమి. ఫైనల్ చేరాలంటే బుధవారం ఆఫ్ఘనిస్థాన్-ఏతో జరిగే మ్యాచ్‌లో తప్పక గెలవాల్సి ఉంది.

# క్రికెట్‌లో అరుదైన ఘటన.. బ్యాటింగ్ మొదలుకాకముందే 10 పరుగులు!

విప్రజ్ నిగమ్ రెండుసార్లు తప్పిదం

పిచ్ రక్షిత ప్రాంతంలో పరుగులు

రెండుసార్లు ఐదు పరుగుల పెనాల్టీ

శ్రీలంక ఇన్నింగ్స్ 10/0తో ప్రారంభం

ఎంసీసీ నిబంధనల ప్రకారం చర్యలు

క్రికెట్‌లో నోబాల్, వైడ్, స్లో ఓవర్‌రేట్ పెనాల్టీలు చూస్తుంటాం. కానీ ఓ ఆటగాడు చేసిన చిన్న పొరపాటు వల్ల జట్టుకే ఏకంగా 10 పరుగుల జరిమానా పడటం చాలా అరుదు. సోమవారం శ్రీలంక 'ఏ'తో జరిగిన ట్రైసిరీస్ మ్యాచ్‌లో భారత్ 'ఏ' జట్టుకు అలాంటి చేదు అనుభవం ఎదురైంది. యువ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ చేసిన తప్పిదం కారణంగా ప్రత్యర్థి జట్టు ఇన్నింగ్స్‌ను నేరుగా 10/0 స్కోరుతో ప్రారంభించింది.విప్రజ్ నిగమ్ బ్యాటింగ్ చేసే సమయంలో మ్యాచ్‌లో పిచ్‌పై ఉన్న రక్షిత ప్రాంతంలో (ప్రొటెక్టెడ్ ఏరియా) రెండుసార్లు పరుగెత్తాడు. అంతకుముందే మరో భారత బ్యాటర్ అనుకుల్ రాయ్‌కు ఇదే విషయంపై అంపైర్లు హెచ్చరించారు. ఆ తర్వాత విప్రజ్ కూడా అదే తప్పు చేయడంతో అంపైర్లు ఐదు పరుగుల పెనాల్టీ విధించారు. అయితే 37వ ఓవర్‌లో మరోసారి విప్రాజ్ పిచ్ మధ్యలోనే పరుగెత్తడంతో రెండోసారి కూడా ఐదు పరుగుల జరిమానా విధించారు.దీంతో మొత్తం 10 పరుగులు శ్రీలంక 'ఏ' ఖాతాలో జమయ్యాయి. ఫలితంగా వారు బ్యాటింగ్ ప్రారంభించే సమయానికి స్కోరు బోర్డుపై నేరుగా 10/0 కనిపించింది. ఈ అరుదైన ఘటన చూసి కామెంటేటర్లు, అభిమానులు ఆశ్చర్యపోయారు.ఎంసీసీ నిబంధనల ప్రకారం బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగా లేదా అవసరం లేకుండా పిచ్‌లోని రక్షిత ప్రాంతాన్ని దెబ్బతీసేలా నడవకూడదు. ఒకసారి హెచ్చరించిన తర్వాత అదే ఇన్నింగ్స్‌లో మళ్లీ తప్పు జరిగితే ఫీల్డింగ్ జట్టుకు ఐదు పెనాల్టీ పరుగులు ఇవ్వొచ్చు. భారత్ 'ఏ' బ్యాటర్లు రెండుసార్లు అదే నిబంధనను ఉల్లంఘించడంతో మొత్తం 10 పరుగుల శిక్ష పడింది.




# విరాట్ కోహ్లీకి 'గర్వం'... రవిశాస్త్రి ఏమన్నారంటే?

మైదానంలో కోహ్లీ అహంకారి, పొగరబోతన్నది నిజమేనన్న రవిశాస్త్రి

కానీ ఫీల్డ్ బయట చాలా వినమ్రంగా, సౌమ్యంగా ఉంటాడని వెల్లడి

కోహ్లీ గురించి ఉన్న అతిపెద్ద అపోహ ఇదేనంటూ వ్యాఖ్య

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మైదానంలో కోహ్లీ ఎంతో దూకుడుగా, గర్వంగా కనిపిస్తాడని, అయితే మైదానం వెలుపల అతని వ్యక్తిత్వం దానికి పూర్తి భిన్నంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశాడు. వీరిద్దరి మధ్య ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, కోహ్లీ వ్యక్తిత్వంపై ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేశాడు.కోహ్లీకి చెందిన 'వన్8' లైఫ్‌స్టైల్ బ్రాండ్ నిర్వహించిన ఒక సంభాషణలో రవిశాస్త్రి ఈ విషయాలను వెల్లడించాడు . కోహ్లీ గురించి సమాజంలో ఉన్నఅభిప్రాయాలపై స్పందిస్తూ, "అహంకారి, పెంకితనం, నిరంతరం దూకుడుగా ఉండటం.. ఇవన్నీ అతడిలో కనిపిస్తాయి. అయితే, ఇవన్నీ కేవలం మైదానానికే పరిమితం" అని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఆట ముగిసిన తర్వాత కోహ్లీ అత్యంత వినయశీలిగా, అందరితో ఎంతో ఆత్మీయంగా మెలిగే వ్యక్తిగా మారతాడని ఆయన వివరించాడు.2017 నుంచి 2021 వరకు రవిశాస్త్రి ప్రధాన కోచ్‌గా, విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఉన్న కాలంలో భారత క్రికెట్ జట్టు అద్భుత విజయాలను నమోదు చేసింది. ముఖ్యంగా ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌లను కైవసం చేసుకోవడం వంటి చారిత్రాత్మక విజయాలు వీరిద్దరి సమన్వయంతోనే సాధ్యమయ్యాయి. జట్టులో అజేయమైన దూకుడును, గెలవాలనే పట్టుదలను నూరిపోయడంలో ఈ ద్వయం కీలక పాత్ర పోషించింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# 100 ఎకరాలు, 3000 మంది.. లగాన్ కోసం పుట్టిన 'చంపానెర్' కథ



**గుజరాత్‌లో 100 ఎకరాల్లో 'చంపానెర్' గ్రామం నిర్మాణం**

**భారీ సెట్ నిర్మాణంలో పాల్గొన్న 3,000 మంది కార్మికులు**

**షూటింగ్ పూర్తయ్యాక సెట్‌ను తొలగించి, రైతులకు భూమిని అప్పగింత**

భారతీయ సినీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిన చిత్రం 'లగాన్'. ఆమిర్ ఖాన్ హీరోగా, అశుతోష్ గోవారికర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం విడుదలై 25 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు మరోసారి చర్చనీయాంశమవుతున్నాయి. అందులో ముఖ్యమైనది, ఈ సినిమా కోసం 'చంపానెర్' గ్రామాన్ని ప్రత్యక్షంగా నిర్మించడం. ఈ కథాంశానికి ప్రాణమైన 'చంపానెర్' అనే కరువు పీడిత గ్రామం వాస్తవానికి ఎక్కడా ఉనికిలో లేదు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో, భుజ్‌కు సమీపంలోని 100 ఎకరాల వ్యవసాయ భూమిలో ఈ గ్రామాన్ని సృష్టించారు. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ నితిన్ దేశాయ్ బృందం 1999లో దాదాపు మూడు నెలల పాటు 3,000 మంది కార్మికులతో ఈ అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఇళ్లు, సన్నని వీధులు, ఆలయం, బావులు.. ఇలా ప్రతి అంశాన్ని ఎంతో సహజంగా తీర్చిదిద్దారు. చివరకు క్లైమాక్స్‌లో కీలకమైన క్రికెట్ మైదానాన్ని కూడా వాస్తవికతకు దగ్గరగా నిర్మించడం విశేషం. ఈ నిర్మాణ ప్రక్రియ కోసం సుమారు 26 మంది రైతుల నుంచి భూమిని సేకరించారు. స్థానిక గ్రామస్థులే నిర్మాణం పనుల్లో పాలుపంచుకోవడంతో పాటు సినిమాలోనూ నటించడం సెట్‌కు మరింత సహజత్వాన్ని చేకూర్చింది. 47 డిగ్రీల ఎండ, విషసర్పాలు, తేళ్లు వంటి ప్రమాదాల మధ్య 350 మందికి పైగా చిత్ర యూనిట్ సభ్యులు అనేక నెలల పాటు అక్కడే ఉండి చిత్రీకరణను పూర్తి చేశారు. షూటింగ్ ముగిసిన అనంతరం ఆ సెట్‌ను పూర్తిగా తొలగించి, యథావిధిగా భూమిని రైతులకు అప్పగించారు. ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లిన ఈ అద్భుత దృశ్యకావ్యం వెనుక ఇంతటి కఠోర శ్రమ దాగి ఉంది.

# ప్రజలను కుక్కలతో పోల్చానా?.. వారు నాకు తల్లితో సమానం: రాఘవ లారెన్స్

ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తనపై జరుగుతున్న ఓ దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. ప్రజలను కుక్కలతో పోల్చానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, తన మాటలను తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం ఏమిటో వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇటీవల రాఘవ లారెన్స్ రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలు, అభిమానులు ఆమోదిస్తేనే తన రాజకీయ ప్రయాణం మొదలుపెడతానని, లేదంటే ఈ ఆలోచనను విరమించుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన తర్వాత ఆయన తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. ఇదే సమయంలో ఆయన ప్రజలను ఉద్దేశించి కించపరిచేలా మాట్లాడారంటూ ఓ వీడియో క్లిప్ వైరల్ అయింది. ఈ వివాదంపై లారెన్స్ సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. "అందరికీ నమస్కారం. నా ఇటీవలి ప్రెస్ మీట్‌కు సంబంధించి ఒక అపోహను నివృత్తి చేయాలనుకుంటున్నాను. నా అభిమానులు, ప్రజలు నాకు అమ్మతో సమానమని నేను ఎప్పుడూ చెబుతుంటాను. అలాంటిది నేను ప్రజలను కుక్కలతో పోల్చానని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా అసత్యం" అని ఆయన పేర్కొన్నారు. తాను చెప్పిన అసలు ఉద్దేశాన్ని వివరిస్తూ.. "మనం ఒక కొత్త ఇంటికి మారినప్పుడు, అక్కడి పరిసరాలను, ఆ ప్రాంతంలోని కుక్కల అలవాట్లను అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుందని చెప్పాను. అంతేగానీ నేను ఎంతో గౌరవించే, అమ్మలా భావించే ప్రజలను కుక్కలతో పోల్చేంత కఠిన హృదయుడిని కాను. కొత్త వాతావరణానికి అలవాటు పడటానికి సమయం పడుతుందనే విషయం గురించి మాత్రమే నేను మాట్లాడాను" అని స్పష్టం చేశారు. దయచేసి అందరూ ఆ పూర్తి వీడియోను చూసి, తాను నిజంగా ఏం చెప్పానో అర్థం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన వివరణకు మద్దతుగా అసలు వీడియోను కూడా తన పోస్టులో పంచుకున్నారు. రాజకీయ రంగ ప్రవేశంపై ప్రజాభిప్రాయం కోరుతున్న తరుణంలో ఈ వివాదం చెలరేగడం, దానిపై లారెన్స్ వెంటనే స్పందించి వివరణ ఇవ్వడం జరిగింది.





# 'బిచ్చగాడు' కంటే 'వంద దేవుళ్ళు' పెద్ద హిట్ కావాలి: నిహారిక కొణిదెల

""బిచ్చగాడు' చిత్రం సాధించిన విజయం కంటే 'వంద దేవుళ్ళు' ఇంకా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ నటి, నిర్మాత నిహారిక కొణిదెల ఆకాంక్షించారు. విజయ్ ఆంటోని హీరోగా నటించిన 'వంద దేవుళ్ళు' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిహారిక, సినిమాపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ.. "ఈ చిత్రాన్ని నేను ఇప్పటికే చూశాను. అమ్మలోనూ ఒక అమ్మాయి ఉంటుందనే పాయింట్‌ను దర్శకుడు శశి అద్భుతంగా చూపించారు. విజయ్ ఆంటోని గారు మంచి నటుడే కాకుండా గొప్ప వ్యక్తి. ఆయనతో మాట్లాడాక గౌరవం మరింత పెరిగింది. అమ్మను ప్రేమించే ప్రతిఒక్కరూ ఈ సినిమాను తప్పక చూడాలి" అని ప్రశంసించారు. హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ.. "దర్శకుడు శశి ఈ కథ చెప్పినప్పుడు కన్నీళ్లు ఆపుకోలేకపోయాను. ఈ చిత్రంతో ఆయన నాకు మరో కొత్త జీవితాన్ని ఇచ్చారు," అని అన్నారు. దర్శకుడు శశి స్పందిస్తూ, ""బిచ్చగాడు' చిత్రానికి ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. అమ్మను దేవతలా చూస్తే అది 'బిచ్చగాడు' అయితే, అమ్మను ఒక సాధారణ మనిషిలా చూస్తే 'వంద దేవుళ్ళు'" అని వివరించారు. ఫాతిమా విజయ్ ఆంటోని సమర్పణలో, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామంజనేయులు జవ్వాజీ నిర్మించిన ఈ చిత్రంలో స్వాసిక, అజయ్ ధీషన్, లిజోమోల్ జోస్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com